మినుములతో వండే గారెలు తింటే కండరాలు అభివృద్ధి చెందుతాయి. మినుముల్లో ప్రోటీన్ అధికం కాబట్టి.

కాని మినుములు బుర్రని మందకొడి చేస్తాయనే నమ్మకం కూడా మన పూర్వీకుల్లో వుంది. సంస్కృతంలో నైషధం రాసిన హర్షుడు, అంతకు ముసుపు రాసిన శ్లోకాలు పెద్ద పెద్ద పండితులకే కొరుకుడు పడలేదట. దాంతో హర్షుడి తెలివికి భయపడ్డ పండితులు దొండపాదుల కింద అతనిచేత మినపసున్ని, గారెలు తినిపించారు. (దొండ కూడా బుద్ధి మాంద్యానికి దారితీస్తుందనే నమ్మకం మనలో వుంది) ఆ తర్వాత కూడా హర్షుడు రాసిన నైషధం కూడా కఠినం. అందుకే 'నైషధం విద్వదౌషధం' అంటారు (ఈ శృంగార నైషధాన్ని శ్రీనాథుడు తెలుగులోకి అనువదించాడు).

గారె మొదట్నించి దక్షిణాది వంటకమే అయినా, ఉత్తరాది వాళ్ళకి ఇది ఎంతో ఇష్టం అయినా వంటకంగా మారింది. ఢిల్లీలో, నార్త్ ఇండియాలోని అనేక ఇతర నగరాల్లో 'సాంబార్ వడ' దర్శనం ఇవ్వ డానికి కారణం ఇదే.

గుండ్రంగా గాని, బొటనవేలు ఆకారంలో గాని, చిల్లుండి కాని, చిల్లులేక కాని ఏ ఆకారంలో ఏ టేస్ట్‌లో వున్నా అది గారె ముక్కే. దానికి ఇంకోటి సరి లేదు.

# దటీజ్ మిస్టర్ వెంగళ్రావ్!

మిస్టర్ వెంగళ్రావ్.

ఈ కాలమ్ రెగ్యులర్‌గా చదివేవాళ్ళకి మిస్టర్ వెంగళ్రావ్ సుపరిచితుడే. ఈ కాలానికి తగ్గట్టుగా కాకుండా, ఎంతో అమాయకంగా, ఏ విషయాన్నయినా లౌక్యంగా కాకుండా ముక్కుకి సూటిగా చూసే పెద్దమనిషి మిస్టర్ వెంగళ్రావ్. నా చిరకాల మిత్రుడయిన అతన్ని ఇటీవల ఓ రైలు ప్రయాణంలో కలిసాను.

రైల్వే టి.సి. ఎవరితోనో గొడవపడుతుంటే ఎవరా అని చూసాను. మా వెంగళ్రావే. టి.సి. చెప్తున్నాడు అతనికి.

"ఈ రైలు నెల్లూరు పోదు. హైద్రాబాద్ పోతుంది."

"అలాగా! అయితే మీరు ఇంజన్ డ్రయివర్‌తో చెప్పకర్లా రైలు రాంగ్‌రూట్‌లో పోతోందని?" అన్నాడు వెంగళ్రావు తాపీగా.

నాతోపాటు వరంగల్‌కి రమ్మని అతన్ని కోరాను. వప్పుకున్నాడు. అతను నాతో రైల్లో సగర్వంగా చెప్పాడు.

"రూపాయికి సిగరెట్ లైటర్, కోట్ హేంగర్ కొన్నానోయ్ విజయవాడ రైల్వేస్టేషన్‌లో"

"రూపాయికే. కొంపతీసి ఎవరూ మోసం చేయలేదు కదా? ఏవీ చూపించు" అడిగాను.

"ఇదిగో. ఇది సిగరెట్ లైటర్. ఇది కోట్ హేంగేర్" అని ఓ అగ్గిపుల్ల, మేకు చూపించాడు గర్వంగా. రాత్రి పడుకోబోయే ముందు ఓ మందుసీసా, మూడు టేబిల్‌స్పూన్స్ బయటికితీసి ఆ మూడు స్పూన్స్‌లో మందు వంపుకుని తాగాడు.

"మూడు స్పూన్స్ దేనికి?" అడిగాను ఆశ్చర్యంగా.

"డాక్టర్ ప్రతి రాత్రి నిద్రపోయే ముందు ఈ మందు మూడు టేబుల్‌స్పూన్స్ తాగాలని చెప్పాడు" జవాబు చెప్పాడు.

"ఇంతకీ దేనికి మందు?" అడిగాను.

"ముక్కుకి, చెవులకి నీకు చలికాలంలో యిబ్బందేం రాదా?" అడిగాడు.

తల అడ్డంగా వూపాను.

"నాకు వస్తుంది.... స్వెట్టర్‌ని వేసుకునేప్పుడు, విప్పేటప్పుడు" చెప్పాడు వెంగళ్రావు.

"ఉదయం నన్ను ఏడున్నరకి ముందు లేపితే ఓ అరగంట తలకాయనొప్పి వస్తోంది. అందుకని నిన్నటి నుంచి అరగంట ఆలస్యంగా లేస్తున్నాను" చెప్పాడు.

మర్నాడు వుదయం రైలు హైద్రాబాద్‌స్టేషన్‌కి చేరేలోగా

కిటికీపక్కన కూర్చుని బయటి దృశ్యాలు చూస్తున్న వెంగళ్రావు నాతో చెప్పాడు ఓ చెరువుని చూపించి.

"ఆ చెరువు లోతెంతో తెలుసా? మూడు అంగుళాలు"

"తప్పు. చెరువులోతు ఎక్కడయినా మూడంగుళాలే వుంటుందా?" అడిగాను చిన్నగా నవ్వుతూ.

"అబద్ధంకాదు. కావాలంటే చూడు. వడ్డున వున్న బాతులు కేవలం మూడు అంగుళాల మేరే తడిసి వున్నాయి. షెర్లాక్ హోమ్స్‌లా ఆలోచిస్తే ఏదయినా ఇట్టే కనిపెట్టెయ్యవచ్చు" చెప్పాడు గర్వంగా చూస్తూ.

ఇద్దరం రైలు దిగాక చెప్పాడు నాతో "ఆకలి దంచేస్తోంది. హోటల్‌లో టిఫిన్ తిని వెళదాం. ఏం?"

ఇద్దరం హోటల్‌కి వెళ్ళాం. మంచి ఆకలిమీద వున్నట్లున్నాడు. ఓ ప్లేట్ ఇడ్లీ, రెండు ప్లేట్‌లు గారె, దోశె, ఓ ప్లేట్ మసాలావడ తిన్నాడు.

"కడుపు నిండిందా?" అడిగాను.

"మసాలావడ తిన్నాక కడుపు నిండింది కాని చిన్న పొరపాటు చేసాను. ముందే మసాలావడ చెప్పివుంటే ఇడ్లీ, గారె, దోశెలు తినాల్సిన అవసరం వుండేది కాదు. దండగ ఖర్చు" చెప్పాడు.

మీకు అనిపిస్తోందా మిస్టర్ వెంగళ్రావు దొంగనోట్లు ముద్రించే మనిషి అయితే నోటుకి ఓ వైపు వందరూపాయలు, మరోవైపు పదిరూపాయలు ముద్రించేరకం అని? వాళ్ళ నాన్న సరిగ్గా అదేపని చేశాడు. వాళ్ళావిడ కూడా ఇదే తరహా. ఓసారి నేను వాళ్ళింటికి వెళ్ళినపుడు 'కాఫీ కావాలా?' అంటే 'సగం కప్పు చాలమ్మా' అన్నాను. ఆవిడ ఆశ్చర్యంగా నావంకచూసి లోపలికి వెళ్ళి సగానికి పగలగొట్టిన కప్పుని తెచ్చి నా చేతిలోవుంచి చెప్పింది. 'ఇంతదాకా సగంకప్పు కావాలని ఎవరూ మీలా అడగలేదు' అని. చెంచాడు కాఫీ చాలంటే ఆవిడ పెళ్ళయిన కొత్తలో సరిగ్గా ఓ చెంచాతో కాఫీ యిచ్చిందిట వెంగళ్రావు తండ్రికి.

ఆ సాయంత్రం వెంగళ్రావుని నేను మెంబర్‌గా వున్న క్లబ్‌కి తీసుకువెళ్ళాను. ఆ క్లబ్‌లో గోడకి స్టఫ్ చేసిన దంతాలున్న ఏనుగు

తలని అలంకరణగా వుంచారు. వెంగళ్రావు అది చూసి ఆ గోడ వెనక గదిలోకి వెళ్తుంటే అడిగాను ఎక్కడికని.

"వెనక గదిలోకి ఏనుగు వెనకభాగం చూద్దామని" చెప్పాడు. ఇంటికి వచ్చాక మర్నాడు ఉదయం మద్రాస్‌కి రమ్మని నాకు ఫోన్ వచ్చింది ఓ ఫిల్మ్ డైరెక్టర్ నుంచి. ఎయిర్‌లైన్స్ ఎంక్వయిరికి ఫోన్ చేసి విమానం ఎప్పుడుందో కనుక్కున్నాడు వెంగళ్రావు. తర్వాత నాతో చెప్పాడు.

"రేపు వుదయం ఓ విమానం వుంది కాని అది దారిలో బెజవాడ, తిరుపతిలో ఆగి వెళ్తుందిట. రేపు రాత్రికి యింకో విమానం వుంది. అది సరాసరి మద్రాస్ పోతుందిట. వుదయం వెళ్ళే విమానం ఆగుతూ ఆలస్యంగా వెళ్తుంది కాని రాత్రి ఫ్లయిట్‌లో వెళ్ళు."

చిన్నగానవ్వి సరేనని తలవూపాను.

"సావిత్రి మహానటిరా. నువ్వెలాగు మద్రాస్ వెళ్తున్నావ్ కాబట్టి నాకు సావిత్రి బర్త్ సర్టిఫికెట్ తెచ్చిస్తావా? మా యింట్లో ఫోటోకట్టి ఆమె గుర్తుగా వేలాడదీస్తాను" అడిగాడు.

"ప్రయత్నిస్తాను" చెప్పాను.

"ప్రయత్నించడంకాదు. పాండిబజార్‌లో ముత్తులింగం అనే అతను యిలాంటివి అమ్ముతుంటాడు. ఆయన దగ్గరే నేను క్రితం నెల మద్రాస్ వెళ్ళినపుడు ఎస్. వి. రంగారావు డెత్ సర్టిఫికెట్ కొన్నాను. దానిమీద స్వయానా ఎస్. వి. రంగారావు ఆటోగ్రాఫ్ కూడా వుంది" చెప్పాడు.

ఎయిర్‌లైన్స్ ఎంక్వయిరీ కౌంటర్ ఫోన్ నంబర్ చూడటానికి టెలిఫోన్ డైరెక్టరిని ఇందాక చూసాడు కాబట్టి దానిమీద తన కామెంట్‌ని పాస్ చేసాడు వెంగళ్రావు.

"తమాషా చూశావా? మీ హైద్రాబాద్‌లో టెలిఫోన్ తీసుకున్న వారంతా ఎలా ఆల్ఫాబెటికల్ ఆర్డర్‌లో అప్లై చేసి తీసుకున్నారో."

కోర్ట్ నుంచి వస్తున్న మా పక్కింటి లాయర్‌ని చూసి వెంగళ్రావు పలకరించి. అడిగాడు

"ఏమిటి మాస్టారు? అయ్యప్పదీక్ష పట్టినట్టున్నారే? ఎప్పుడు కొండకి వెళ్తున్నారు?"

ఆయన నన్ను పక్కకి పిలిచి అడిగాడు.

"ఎవరండి ఈయన? 'మా ఆవిడ నూతిలో పడతానని బెదిరించి వెళ్ళింది. కాస్త చూడండి. ఆనవాలు పట్టడం తేలికే. దాని కుడిచెవి వినపడదు' అన్నాట్ట వెనకటి కొకాయన. అలా వున్నాడు."

చిన్నగా నవ్వి అ వెనకటి కొకాయన, ఈయన ఒకరే అని చెప్పి పంపాను లాయర్‌గారిని. సాయంత్రం వంటరిగా బజారుకి వెళ్ళివచ్చాడు. చేతిల్లో ఓ టార్చిలైటుతో తిరిగి వచ్చాడు.

"సుల్తాన్‌బజార్‌లో కొన్నా గురూ. సోలార్‌పవర్‌తో పనిచేసే టార్చ్‌లైట్ యిది. సూర్యరశ్మి యిదిగో ఈ ఎర్రటిగీతమీద పడుతుంటే బేటరీ అక్కర్లేకుండా వెలుగుతుంది."

"కాని దీని అవసరం చీకట్లో కదా వచ్చేది? రాత్రుళ్ళు ఈ ఎర్ర గీతమీద సూర్యరశ్మి పడే అవకాశం వుండదుగా?" అడిగాను.

"బేటరీ లేకుండా పని చేస్తుందిగా అందుకని కొన్నాను. కాని ఇది ఆలోచించలేదు" చెప్పాడు ఆలోచనగా.

"ఆ మధ్య మా అవిడ నామీద అలిగి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది తెలుసా?" చెప్పాడు రాత్రి భోజనాల దగ్గర.

"ఏమైంది?" అడిగాను.

"ఏముపడమేమిటి? మేం ఇద్దరం పోట్లాడుకున్నాం. ఇంట్లో ఏస్ప్రిన్ టేబ్లెట్లున్నాయి. వాటిని మింగి చావాలనుకుంది. కానీ లక్కీగా రెండు మింగగానే మా పోట్లాటవల్ల వచ్చిన తలనొప్పి పోవడంతో ఆ ప్రయత్నం విరమించుకుంది" చెప్పాడు.

"ఇంతకీ అసలు ఎందుకు పోట్లాడుకున్నారు మీరిద్దరు?" అడిగాను.

'మిస్ అండర్‌స్టాండింగ్ అనుకో. నేను ఎదురింటాయన కూతుర్ని ప్రేమిస్తున్నానుకుంది. అందులో నిజంలేదు."

"నిజం లేకపోతే ఎందుకనుకుంది?" అడిగాను.

"పుస్తకం టేబిల్‌మీద వుంది. టేబిల్ నేలమీద వుంది. అంతే

లాజికల్‌గా ఆలోచిస్తే పుస్తకం నేలమీద వున్నట్లేగా అన్నాను. దాంతో పోట్లాడుకున్నాం."

"అందులో పోట్లాడుకునేందుకేముంది?"

"నేను మా ఎదురింటాయన్ని యిష్టపడుతున్నాను. మా ఎదురింటాయన ఆయన కూతుర్ని యిష్టపడతాడు. అంటే నేను ఎదురింటాయన కూతుర్ని యిష్టపడ్డట్లే అనిఅర్థం చేసుకుంది మా ఆవిడ."

నేను వెంగళ్రావు యింటికి వెళ్ళినపుడు అతను, అతని భార్య ఓ చెక్క బీరువాని మెట్లమీద పట్టుకుని నిలబడ్డారు. "మనం దీన్ని "పైకి తీసుకెళ్ళలేం కూలీలని పిలుద్దాం" అని వెంగళ్రావు అంటే, పైకి తీసుకెళ్ళడమేమిటి? దీన్ని కిందకి తీసుకెళ్తున్నాం అనుకున్నా" అన్నది. అదీ మిసెస్ వెంగళ్రావు కేరెక్టర్.

వెంగళ్రావుని రైలు ఎక్కించడానికి తీసుకువెళ్ళాను. దారిలో ఏదో కనబడితే వంగి తీసుకుని చూసాడు. అది ఆడవాళ్ళ హేండ్ బేగ్స్‌లో వుండే అద్దం.

అందులోకి చూసి మళ్ళీ పారేస్తూ చెప్పాడు.

"దరిద్రంగా వుంది ఎవరి కలర్ ఫోటోనోకాని. అందుకే పారేసి వుంటారు."

దటీజ్ మిస్టర్ వెంగళ్రావ్.

# లైఫ్ లాంగ్ కంపేనియన్

"నీ లైఫ్‌లాంగ్ కంపెనియన్ ఎవరు?" అని ఓ పెళ్ళయిన పెద్ద మనిషిని ఎవరో అడిగితే తన భార్య పేరు చెప్పలేదు. బదులుగా 'నా కళ్ళజోడు' అని సమాధానం యిచ్చాడు. నిజమే. భార్య జీవితాంతం వుంటుందో, వుండదో నమ్మకం లేదు. కాని ఓసారి చూపు మందగించి కళ్ళజోడు వస్తే జీవితాంతం దానిని ధరించి తీరాల్సిందే.